సాక్షి
అనకాపల్లి
ఆదివారం ၊ 3 ၊ సెప్టెంబర్ ၊ 2023



సంస్కరణల ఘనత సీఎం జగన్‌దే

పరిపాలనలో సంస్కరణలు తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 8లో



వనం వదిలి.. జనంలోకి..

సాక్షి, విశాఖపట్నం : కంబాలకొండలో ఉన్న జింకలు తాగునీటి కోసం శనివారం జాతీయ రహదారిపైకి చేరుకున్నాయి.



త్వరితగతిన రోడ్డు పనులు

ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ముగిసిన ఎన్‌సీసీ ఐజీసీ ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్



క్యాడెట్లకు జ్ఞాపికలు అందజేస్తున్న వి.ఎం. రెడ్డి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌సీసీ ఐజీసీ ఎన్‌ఎస్‌ఎస్ – 23 క్యాంప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ క్యాడెట్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ క్యాడెట్లు ప్రదర్శించిన బతుకమ్మ సాంస్కృతిక కార్యక్రమానికి మొదటి స్థానం లభించింది. ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు ఏపీ, తెలంగాణ డీడీజీ ఎయిర్ కమాండర్ వి.ఎం.రెడ్డి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, క్యాంప్ కమాండెంట్ సి.జి.ఇంగ్లీష్వర్, విశాఖపట్నం ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ అరవింద్ నాగర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నేడు

నర్సీపట్నం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్‌లో గణనీయ పురోగతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ రంగం ఈ ఆర్థిక సంవత్సరంలో గణనీయమైన పురోగతి కనబరుస్తుంది. ఈ ఆగస్టు నెలలో విలువ ఆధారిత ఉత్పత్తులు గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 1,57,000 టన్నుల అమ్మకాలు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఆగస్టు వ్యవధిలో 5,57,000 టన్నుల విలువ ఆధారిత ఉక్కు అమ్మకాలు చేసి ఇప్పటిదాకా ఈ వ్యవధిలో చేసిన అమ్మకాల కంటే మెరుగైన రికార్డు సాధించింది. ఆగస్టులో 79 వేల టన్నులు వైర్ రాడ్ కాయిల్స్, 1,99,000 టన్నుల రీబార్స్, 46 వేల టన్నులు స్ట్రక్చరల్ ఉత్పత్తులు అమ్మకాలు చేసి గతంలో ఏ ఆగస్టులో లేని విధంగా అత్యుత్తమ విక్రయాలు సాధించింది. ఆగస్టులో రూ. 2,502 కోట్లు అమ్మకాలు చేసి గత ఏడాది ఇదే వ్యవధిలో జరిగిన రూ.1,806 కోట్లు అమ్మకాలు కంటే 39 శాతం వృద్ధిని నమోదు చేసింది. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి మార్కెటింగ్ సిబ్బందిని అభినందించారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గోవిందరావు



విశాఖ లీగల్: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది ఇ.గోవిందరావు నగరంలోని ప్రధాన మెట్రోపాలిటీ సెషన్ కోర్టు అదనపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. గోవిందరావు మాదకద్రవ్యాలు, గంజాయి నిషేధిత మత్తు మందులు వంటి కేసులకు ఏపీపీగా వ్యవహరిస్తారు. ఆయన నియామకం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, పి.నర్సింగరావు, ఉపాధ్యక్షుడు రామ జోగేశ్వరరావు, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు బి.ఎస్.లత హర్షం వ్యక్తం చేశారు.

నిను మరువలేం రాజన్నా..

సంక్షేమ ప్రదాత...జన హృదయ నేత...అపర భగీరథుడు.. ఆరోగ్యశ్రీతో అభాగ్యుల జీవితాల్లో వెలుగు నింపిన ప్రాణదాత... దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖర రెడ్డికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- వైఎస్సార్‌కు ఘనంగా నివాళులు
- వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు
- పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు, అన్నదానం
- నిరుపేదలకు, వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ

సాక్షి, అనకాపల్లి: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా సేవాకార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ శ్రేణులూ, అభిమానులు సేవా కార్యక్రమాలతో ఘనంగా నివాళులర్పించారు. వాడవాడలాఅన్నదానాలు, పేదలకు వస్త్రాలు,దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

- అనకాపల్లి నియోజకవర్గం పరిధి కశింకోటలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పట్టణ పార్టీ కార్యాలయంలో ఎంపీ బి.వి. సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, వీధుల్లో స్థానిక పార్టీ శ్రేణులు వైఎస్సార్ విగ్రహానికి, చిత్రపటాలకు పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. మహానేత ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.
- నర్సీపట్నం నియోజకవర్గంలో అబీద్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.
- యలమంచిలి నియోజకవర్గంలోని, యలమంచిలి పట్టణం స్టేషన్ రోడ్డులో ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహానికి, అచ్యుతాపురం జంక్షన్లో, రాంబిల్లిలో ఉన్న విగ్రహానికి ఎమ్మెల్యే కన్నబాబురాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దిబ్బపాలెం సెజ్ కాలనీలో నిర్వహించిన సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. పేదలకు బియ్యం, కూరగాయాలు పంపిణీ చేశారు. రాంబిల్లిలో కొత్త ఫించన్లు పంపిణీ చేశారు. మునగపాక మండలంలోని వాడ్రాపల్లిలో దివంగత నేత రాజన్న విగ్రహానికి వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు.
- పాయకరావుపేట పట్టణంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. నక్కపల్లి మండలం ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే బాబూరావు రోగులకు పాలు, రొట్టెలు, పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.



అనకాపల్లి రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ సత్యవతి, బొడ్డేడ ప్రసాదు

మహానేత ఆశయ సాధనకు కృషి

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పూడిమడక హైవేలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, బొడ్డేడ ప్రసాద్, దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్: బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక జాతీయరహదారిపై పూడిమడక జంక్షన్ వద్ద గల ఆయన విగ్రహానికి మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ పేదలకోసం ఎన్నోసంక్షేమ పథకాలు అమలు చేసిన రాజశేఖర రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్నారని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకునే బాధ్యత మనఅందరిపై ఉందన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ తండ్రి ఆశయసాధనకు జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి, మరో సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఒక్కొక్క కుటుంబానికి సుమారు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మండల కార్యదర్శి బీశెట్టి జగన్ పాల్గొన్నారు.

మహాశ్రేష్టం.. మట్టి గణపతి

- పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకుందాం
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్(విశాఖ): అగ్రగామి నగరంగా భాసిల్లుతున్న విశాఖలో పర్యావరణహితంగా వినాయక చవితిని జరుపుకుందామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ఉపయోగించొద్దని, ఒకవేళ ఉపయోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు తయారు చేసే వారి నుంచి మార్కెట్లోకి బొమ్మలు వెళ్లకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని 'ఎకో–వైజాగ్'కార్యక్రమం ప్రారంభించామని.. ఇందులో భాగంగా ఎకో–క్లీన్, ఎకో–గ్రీన్, ఎకో–బ్లూ, ఎకో–జీరో ప్లాస్టిక్, ఎకో–జీరో పొల్యూషన్ పేరిట ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎకో–జీరో ప్లాస్టిక్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, సచివాలయ, జీవీఎంసీ సిబ్బందితో కలిసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రత్యేకంగా నిఘాపెట్టామన్నారు. ఇప్పటివరకు 63,415 దాడులు చేసి, 4,250 కిలోల ప్లాస్టిక్‌ను సీజ్‌చేశామన్నారు. రూ.38,58,258 జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించారు.

మట్టి గణపతినే పూజిద్దాం

వినాయక చవితిని పర్యావరణహితంగా జరుపుకునేందుకు జీవీఎంసీ తగిన జాగ్రత్తలు చేపట్టిందని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే విగ్రహాల తయారీదారులతో సమావేశం నిర్వహించామని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మెటీరియల్‌కు బదులు మట్టితో ప్రతిమలు తయారు చేయాలని సూచించామన్నారు. మండపాల ఏర్పాటులో కూడా ప్లాస్టిక్‌ను కాకుండా.. పర్యావరణ హిత వస్తువులను వాడాలని సూచించారు. విగ్రహాల నిమజ్జనం కోసం పలు ప్రాంతాల్లో నీటితో కూడిన వాహనాలు ఏర్పాటు చేస్తామని, వీటిని నగర ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

జగనన్న పాల వెల్లువ ద్వారా రుణాలు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట: జగనన్న పాల వెల్లువ ద్వారా మహిళా పాడి రైతులకు రుణాలు ఇవ్వనున్నట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పేటలో పాడి రైతులతో నిర్వహించిన రుణ మేళా సదస్సును శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువుల పోషణకు జగనన్న పాల వెల్లువ ద్వారా రూ.30 వేల రుణం ఏడు శాతం వడ్డీపై అందించనున్నట్టు తెలిపారు. పాడి పశువుల కొనుగోలుకు రూ.1.60 లక్షల వరకు 8.5 శాతం వడ్డీపై రుణాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎకరం భూమి హామీ ఇస్తే రూ.5 లక్షల వరకు రుణాన్ని అందిస్తారన్నారు. డీసీసీబీ ద్వారా అమూల్ కేంద్రాలకు పాలు పోసే రైతులకు ఈ రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పాల ధర ఏ మేరకు లభిస్తుందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా పశువుల దాణా కిలో రూ.6.50కు అందజేయనున్నట్టు కలెక్టర్ చెప్పారు. కశింకోట పశు వైద్యాధికారి ఆల్ఫాన్సా జార్జి మాట్లాడుతూ రుణ మేళాలో ఇద్దరు రైతులను ఎంపిక చేసినట్టు తెలిపారు. వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, డీసీసీబీ ప్రతినిధి అచ్చియ్యనాయుడు, రూట్ ఇన్‌చార్జి మురళి పాల్గొన్నారు. కశింకోట, ఈ.చౌడువాడ, పాత కన్నూరుపాలెంలో నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్య మణి ఆధ్వర్యంలో జగనన్న పాల వెల్లువ పాడి రైతులకు రుణ మేళా నిర్వహించారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

అనకాపల్లిటౌన్: రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హత్య, హత్యాయత్నం, దోపిడీ నేరాలకు పాల్పడిన రౌడీషీటర్ల కేసుల దర్యాప్తును వేగవంతం చేసి కోర్టులో నేరాభియోగపత్రాలు సమర్పించాలని ఆదేశించారు. బెయిల్‌పై వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడితే బెయిల్ రద్దుచేయాలని కోర్టును కోరాలని చెప్పారు. కఠిన శిక్షలు త్వరితగతిన పడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాత్రి గస్తీ తిరిగే పోలీసులు రౌడీషీట ర్ల ఇళ్లను తనిఖీ చేసి, వారు ఇళ్లలో ఉన్నదీలేనిదీ తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 9న లోక్ అదాలత్ సందర్భంగా ఇరుపార్టీలు స్వచ్ఛందంగా రాజీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలనిఅధికారులకు సూచించారు. అదనపుఎస్పీ బి.విజయభాస్కర్, డీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

ఇన్‌స్పైర్ చేద్దాం రండి

- కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణల వేదిక ఇన్‌స్పైర్ మనక్
- అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
- 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు అవకాశం
- యూపీ స్కూళ్లకు 3, హైస్కూళ్ల కు 5 ప్రాజెక్ట్ నమూనాలు
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రోత్సాహకాలు
- ఈ నెల 30 వరకూ గడువు
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 1967 నామినేషన్లు



గత ఏడాది రాష్ట్ర స్థాయికి ఎంపికైన నమూనా

అనకాపల్లి రూరల్: ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ దాగి ఉంటుంది. దానిని వెలికితీసేలా ప్రోత్సహిస్తే భావి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుంది. అలాంటి విద్యార్థుల కోసం 2009 నుంచి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్‌స్పైర్ మనక్ పేరిట విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నాయి. చిన్నారుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంపొందించేందుకు, నూతన ఆవిష్కరణల రూపకల్పనలను ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 30 తుది గడువు కావడంతో పాఠశాలల వారీగా దరఖాస్తు ప్రక్రియపై ఉపాధ్యాయులు దృష్టి సారించారు. 6 నుంచి 10వ తరగతుల వరకు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చు. ప్రతి పాఠశాల నుంచి ఐదు ఉత్తమ ఒరిజినల్ ఆవిష్కరణలు/ఆలోచనలను వెబ్‌సైట్‌లో తుది గడువులోగా అప్‌లోడ్ చేయడానికి అవకాశం కల్పించారు.

జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు పోటీలు

నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత మొదట జిల్లా స్థాయిలో పోటీల ప్రదర్శన నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. అక్కడ ఎంపికైతే జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఇలా జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా గుర్తించి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేస్తారు. జిల్లా స్థాయిలో ఎంపికైతే రూ.10వేలు, రాష్ట్ర స్థాయిలో ఎంపికైతే రూ.40 వేలు, జాతీయ స్థాయికి ఎంపికైతే రూ.60 వేలు నగదు బహుమతిని నేరుగా విద్యార్థి అకౌంట్‌లో జమ చేస్తారు. ఈ కసరత్తు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 ప్రాజెక్టులకు, ఉన్నత పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులకు దరఖాస్తులు తప్పనిసరిగా వచ్చేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని అధికారులు సూచిస్తున్నారు. గత ఐదేళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి తొమ్మిది ఆవిష్కరణలు ఎంపికయ్యాయి.

ఇన్‌స్పైర్ నామినేషన్లు, ఎంపిక వివరాలు

సంవత్సరం	నామినేషన్లు	ఉమ్మడి జిల్లాలో ఎంపికైనవి
2017-18	1,216	116
2018-19	4,386	436
2019-20	3,261	319
2020-21	2,657	260
2021-22	2,502	244
2022-23	2,318	203
2023-24	1,967(ఇప్పటివరకు)	

నిబంధనలు ఇవీ..

- ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి 10 వ తరగతి వరకు చదివే విద్యార్థులు పాల్గొనవచ్చు.
- ఇంటికి సంబంధించిన లేదా రైతులు, కూలీల సమస్యలైనా, దైనందిన సమస్య ఏదైనా విద్యార్థి దానికి సహజమైన, సృజనాత్మక, నవీన పద్ధతిలో తగిన పరిష్కారం చూపితే నామినేషన్లకు పంపేందుకు వీలుంటుంది.
- డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛ భారత్, మేక్ ఇన్ ఇండియా, సమాజాభివృద్ధి, క్లీన్ ఇండియా అంశాల ఆధారంగా ప్రాజెక్టులు రూపొందించాలి.

దరఖాస్తు విధానం ఇలా..

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులో పాల్గొనేందుకు ప్రాజెక్టు వివరాలను పాఠశాల ఐడీ ద్వారా గడువులోపు www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థి పాఠశాలకు సంబంధించిన వివరాలను పొందుపరచాలి. విద్యార్థుల దరఖాస్తు సంబంధిత జిల్లా అథారిటీకి చేరుతుంది. దరఖాస్తును ఆమోదించిన తర్వాత దరఖాస్తుదారు ఇచ్చిన మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది. ఆ లింక్‌తో వచ్చిన ఐడీతో పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. అనంతరం విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలి.



సరవ హైస్కూల్‌లో సైన్స్ నమూనాల ప్రదర్శన

భవిష్యత్తులో మంచి అవకాశాలు



అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులు. ప్రతి ఒక్క పాఠశాల నుంచి పోటీలో విద్యార్థులను భాగస్వాములను చేయాలి. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను,శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీసేలా ప్రదర్శనలు రూపొందించి, సకాలంలో నామినేషన్లు దాఖలు చేయించాలి. ప్రతి పాఠశాల యాజమాన్యం ప్రాజెక్టుల నమోదు ఎకనాలెడ్జ్‌మెంట్‌లు డీఈవో కార్యాలయాల్లో ఇవ్వాలి. ఇన్‌స్పైర్ మనక్‌లో ప్రాతినిథ్యం వహించే విద్యార్థులకు భవిష్యత్తులో అనేక మంచి అవకాశాలు ఉన్నాయి. ఉన్నత విద్యా సంస్థల్లో ఉచితంగా సీట్లు పొందవచ్చు.

– డాక్టర్ కప్పుల ప్రసాద్, ఉమ్మడి జిల్లా సైన్స్ అధికారి

పీఎం విశ్వకర్మ పథకంపై అందరికీ అవగాహన

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



తుమ్మపాల: పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులందరికీ అమలు చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ నెల 17న ప్రారంభించనున్న విశ్వకర్మ పథకంపై అందరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. చేతివృత్తుల వారిని ఆదుకునేందుకు ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. జిల్లాలో అర్హులందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 18 రకాల సంప్రదాయ చేతివృత్తుల వారికి ఈ పథకం వల్ల ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. 18 సంవత్సరాల వయస్సు పైబడి, గత ఐదు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం పొందని వారు అర్హులన్నారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదని చెప్పారు. కుటుంబంలో ఒక వ్యక్తి మాత్రమే అర్హుడని తెలిపారు. ఈ పథకం ద్వారా రోజుకు రూ.500 ఉపకార వేతనంతో శిక్షణ, పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డు ఇస్తారని, శిక్షణ అనంతరం పరికరాల కొనుగోలుకు రూ.15 వేలు ఆర్థికసాయం అందిస్తారని తెలిపారు. హస్త కళాకారులు ఈ పథకం ద్వారా సబ్సిడీ, 5 శాతం తక్కువ వడ్డీతో మొదటి విడతగా రూ.1 లక్ష, రెండవ విడతగా రూ.2 లక్షలు రుణం పొందవచ్చన్నారు. ఆసక్తి గల వారు తమ పరిధిలోని సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనావాసాల మధ్య గోవధపై ఫిర్యాదు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి ఆర్సీఎం స్కూల్‌కు ఎదురుగా ఓ ఇంట్లో గుట్టుగా సాగుతున్న గోవధపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంత కాలంగా ఇక్కడ జనావాసాల మధ్య గోవధ చేయటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ మేరకు పోలీసులు స్వయంగా వెళ్లి వధించిన గోవును పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని టౌన్ పోలీసులు తెలిపారు.

ఏలేరు కాల్వలో జారిపడి వృద్ధుడి మృతి

కశింకోట: ఉగ్గినపాలెం వద్ద ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ జారి పడి వృద్ధుడు శనివారం మృతి చెందారు. అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు అందించిన వివరాలివి. ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన బుదిరెడ్డి కామయ్య శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని తన ఇంటి నుంచి వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెదికారు. గ్రామ సమీపంలో శనివారం ఉదయం సమీపంలోని ఏలేరు కాలువ గట్టుపై చెప్పులు ఉండడం, ఈ ప్రాంతంలో కొంత సేపటికి మృతదేహం తేలడంతో వెలికి తీశారు. అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టంకు తరలించారు. బహిర్భూమికి వెళ్లి కాలువలో ప్రమాదవశాత్తూ జారి మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. భార్య చిలుకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు రైతు అని తెలిపారు.

మహిళా ఎస్‌ఐ అభ్యర్థులకు ముగిసిన పరీక్షలు



పరుగు పోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్‌ఐ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో భాగంగా మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు శనివారంతో ముగిశాయి. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో గత నెల 30న మహిళా అభ్యర్థులకు పరీక్షలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆఖరి రోజున 690 మందికి హాల్‌టికెట్లు పంపగా.. 555 మంది హాజరయ్యారు. వారికి బరువు, ఎత్తు, పరుగు, లాంగ్ జంప్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 4 నుంచి పురుష అభ్యర్థులకు యథావిధిగా పరీక్షలు కొనసాగుతాయని రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు.

పాలనా సంస్కరణల ఘనత సీఎం జగన్‌దే





గ్రామ సచివాలయాన్ని, వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

పాయకరావుపేట: పరిపాలనలో సంస్కరణలు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పాలనా వికేంద్రీకరణ జరిగిందని రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని గోపాలపట్నంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.5 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్లను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, గవరకార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌లతో కలిసి మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు చేరువగా పాలన అందించిన ఘనత, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు అందరూ మళ్లీ జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలన్న సంకల్పంతో ఉన్నారని చెప్పారు. జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ స్థానంలో వైఎస్సార్‌సీపీని గెలిపించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా అందిస్తామన్నారు. ఈ దిశగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని చెప్పారు. అనంతరం స్థానికంగా సీతమ్మ కొండపై వెలసిన ఉమాధర్మ లింగేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక డెక్కన్ ఫైన్ కెమికల్ ఫ్యాక్టరీ సీఎస్‌ఆర్ నిధులతో కొండపైకి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి దేవవరపు రాజేష్ ఖన్నా, గోపాలపట్నం గ్రామ సర్పంచ్ పన్నీరు బాబ్జీ, పార్టీ జిల్లా కార్యదర్శులు కోడ కోటేశ్వరరావు, యజ్జల అన్నవరం, మాసాహెబుపేట, కేశవరం, మంగవరం, పెంటకోట సర్పంచ్‌లు గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, మేడిశెట్టి రామగోవిందు, వంగలపూడి సరస్వతీ రామారావు, చేపల తాతాజీ, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సరదాగా ఈతకెళ్లి.. కానరాని లోకాలకు..

తాండవ కాలువలో యువకుడు మృతి



వినయ్ (ఫైల్)

ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చిందని తమ కుమారుడు చెప్పిన మాటలకు ఆ తల్లి దండ్రులు ఎంతగానో పరవశించిపోయారు. ఆదివారం వైజాగ్ వెళ్లి చేరుతానని స్నేహితులతో సైతం తన ఆనందాన్ని పంచుకున్నాడు. ఇంతలోనే కాలువలో ఈతకు దిగి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారంతా జీర్ణించుకోలేకపోతున్నారు.

నాతవరం: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకెళ్లిన యువకుడు తాండవ కాలువలో మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని శృంగవరంలో శనివారం చోటు చేసుకుంది. నాతవరం ఇన్‌చార్జి ఎస్‌ఐ రామారావు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పైల స్వామినాయుడు అలియాస్ వినయ్ (23) శనివారం తోటి స్నేహితులతో కలిసి గాంధీనగరం గ్రామ సమీపంలో తాండవ కాలువలో ఈతకు దిగాడు. కొంత సేపు ఈత కొట్టాక అందరూ ఒడ్డుకు చేరుకోగా, స్వామినాయుడు రాకపోవడాన్ని గమనించిన స్నేహితులు కాలువలో పరిశీలించారు. అతడు ఈత కొట్టే ప్రదేశంలో నాచు పెరిగిపోయి లాకులు ప్రమాదకరంగా ఉన్నాయి. దాంతోనే లాకులో చిక్కుకుపోయి మరణించినట్టు తెలుస్తోంది. గతంలో ఇలా చాలా మంది చిక్కుకొని మృతి చెందినట్టుగా స్థానికులు చెబుతున్నారు. మృతుడు తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు నాతవరం హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రైవేటు ఉద్యోగం వచ్చిందని...

పైల అప్పలనాయుడు, సత్యవతి దంపతుల చిన్న కుమారుడు వినయ్ కాకినాడ జిల్లా కోటనందూరులో ప్రైవేటు కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. సత్యవతి అక్క అల్లు ఎరుకులమ్మకు సంతానం లేకపోవడంతో పెద్ద కుమారుడు మహేష్‌ను దత్తత ఇచ్చారు. అతడు గ్రామ వలంటీరుగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ప్రైవేటు కంపెనీలో చేరడానికి ఆదివారం ఉదయం వైజాగ్ వెళ్తానని స్నేహితులతో వినయ్ చెప్పాడు. కొడుకు ఉద్యోగంలో చేరుతున్న విషయం తెలిసి తల్లిదండ్రులు ఆనందపడ్డారు. ఇంతలో ఉద్యోగంలో చేరకుండానే అతడు మరణించడంతో గ్రామంలో విషాదం నెలకొంది. చేతికందివచ్చిన కుమారుడు మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు.

అనకాపల్లిని కరవు జిల్లాగా ప్రకటించాలి

ఏ.పి. రైతు సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చోడవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవడానికి కరవు ప్రాంతంగా ప్రకటించాలని ఏ.పి. రైతు సంఘం డిమాండ్ చేసింది. సంఘం జిల్లా అధ్యక్షుడు జి.మాణిక్యం అధ్యక్షతన శనివారం స్థానిక నూకాంబిక కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ హాజరై మాట్లాడారు. జిల్లాలో 70 శాతం పైగా ప్రజలకు వ్యవసాయమే జీవనాధారమన్నారు. ప్రధానంగా వాణిజ్య పంట చెరకు సాగుపై రైతులతోపాటు అనేక మంది వ్యవసాయ కూలీలు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చక్కెర ఫ్యాక్టరీలు మూతపడటంతో వీరి జీవనోపాధి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో సాగు సాయం కింద ఎకరాకు పది వేల రూపాయలు అందజేయాలని, రూ.2.5 లక్షల వరకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6న ప్రతి గ్రామ సచివాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో గిరిజనుల భూములకు ఆర్వోఆర్ పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, రాజన్న, దొరబాబు, గొల్ల గురుబాబు, కాసుబాబు, కామిరెడ్డి లక్ష్మి, కాకర కాంతం తదితరులు పాల్గొన్నారు.

పాడె మోసిన ఎమ్మెల్యే పాల్గుణ

● బౌద్ధ మత గురువు మృతికి సంతాపం



పాడెను మోస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ మాసాడలో బౌద్ధ మత గురువు గొల్లోరి జీనబంధు మృతికి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సంతాపం తెలిపారు. శనివారం ఆయన గ్రామంలో పర్యటించారు. బౌద్ధ మత గురువు మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్మశాన వాటిక వరకు పాడి మోశారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాకరి బొంజుబాబు పాల్గొన్నారు.

ఆరిల్లోవ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి

అర్‌అండ్‌బి చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి పరిశీలన

గొలుగొండ: నర్సీపట్నం-కృష్ణదేవిపేట మార్గంలోని ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ ఎల్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇక్కడ 3.5 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆయన శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిధుల కొరత లేదని పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నాణ్యతా లోపం లేకుండా పనులు చేయాలన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులు, రికార్డులు పరిశీలించారు. ఈ రోడ్డు పనులు పూర్తి చేయడం వల్ల రెండు జిల్లాలకు చెందిన వేలాది మంది వాహనదారులకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. రోడ్డు పనులతోపాటు కల్వర్టు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్ఈ క్రాంతిమతి, పాడేరు ఈఈ బాలసుందరరావు, నర్సీపట్నం డీఈఈ నాగమోహన్, జేఈ ప్రసాద్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కిందుగూడలో శనివారం కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. కిందుగూడ గ్రామంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలుడు కె.సునీల్‌పై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన అతనిని తండ్రి డొంబు, కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారి వివేక్ వైద్య సేవలు అందించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల పర్యవేక్షణలో వైద్యసేవలందిస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాల సేవలు భేష్



వేములవలస రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

ఆనందపురం: రైతు భరోసా కేంద్రాల పనితీరు భేషుగ్గా ఉందని, వీటి వల్ల రైతులకు మంచి సేవలు అందుతున్నాయని కేంద్ర బృంద సభ్యులు ప్రశంసించారు. మండలంలోని వేములవలస రైతు భరోసా కేంద్రాన్ని వారు శనివారం సాయంత్రం సందర్శించారు. కేంద్ర ఎరువులు సరఫరా నియంత్రణ కార్యాలయం డైరెక్టర్ (మూవ్‌మెంట్) హరివీంద్ర సింగ్, వ్యవసాయ శాఖ కార్యాలయం జాయింట్ డైరెక్టర్ (ఇన్‌పుట్స్) కమిషనర్ విడివి కృపదాస్, ఇతర అధికారులు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి వ్యవసాయాధి కారులను, రైతులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన కియాస్క్ ద్వారా రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలను బుక్ చేసుకోవడం, వాటిని సకాలంలో రైతులకు అందించడం, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయం, పంటలు బీమా కోసం ఈ క్రాపింగ్ విధానం, కస్టమర్ హైరింగ్ సెంటర్ (సిహెచ్‌సి) ద్వారా రైతులకు అద్దె ప్రాతిపదికన యంత్ర పరికరాలు సరఫరా వంటి విషయాలను పరిశీలించారు. రాష్ట్రంలో రైతులు కోసం అమలు చేస్తున్న పథకాలు, అందుతున్న సేవలను తెలుసుకొని అభినందించారు. పూర్తి వివరాలను నివేదిక రూపంలో కేంద్రానికి అందజేస్తామని అధికారుల బృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ సహాయ సంచాలకుడు బి.విజయ్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ, వీఏఏ అహమ్మద్ గౌస్, ఏహెచ్ఏ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అలరించిన ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు



కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు అలరించాయి. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కాళీ మర్దనం అలంకరణ ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేసింది. చిన్న కృష్ణులు ఉట్టి కొట్టి సందడి చేయగా, గోపికలు ఉట్టి లాగుతూ, నృత్యాలు చేస్తూ, కృష్ణుని గీతాలు ఆలపించారు. విద్యార్థులకు మన పండగల ఆవశ్యకతను విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ సంబరాలను నిర్వహించామని ఈ సందర్భంగా విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జి సంధ్యారాణి, డి.భార్గవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

అనకాపల్లిటౌన్: మండలంలో సుందరయ్యపేట, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి గ్రామాల్లో విద్యుత్ సమస్యతో నిత్యం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని సుందరయ్యపేట గ్రామ ప్రజలు సురేష్, రాజు, స్వాతి, గణేష్‌లు శనివారం ఒక ప్రకటనలో కోరారు. సుమారుగా ఆరు మాసాలుగా విద్యుత్ సరఫరాలో సమస్యలు కొనసాగుతున్నాయన్నారు. తక్షణమే విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.

కురిసిన వర్షం.. రైతుల హర్షం

కశింకోట: కశింకోట ప్రాంతంలో శనివారం సాయంత్రం గాలితోపాటు మోస్తరుగా వర్షం పడింది. వరి రైతుల్లో ఆనందం కలిగించింది. సుమారు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆకాశం కారుమబ్బులు కమ్మి, భారీ గాలులు వీచాయి. తర్వాత అర్థగంట తర్వాత వర్షం కురవడం ప్రారంభమైంది. దాదాపు గంటపాటు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. వర్షం ముందు వీచిన గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు సాయంత్రం 5 గంటల నుంచి అంతరాయం కలిగింది. రాత్రి 7.15 ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ వర్షం ఎండుతున్న వరి నారుమళ్లు, వరి నాట్లకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

50 మంది రక్తదానం

కశింకోట: కశింకోటలోని పీఏసీఎస్ వద్దనున్న కల్యాణ మండపంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన శిబిరంలో 50 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి పంపిణీ చేశారు. మహిళలకు చీరలు అందించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు, మండల నాయకులు ఉత్తాడ రామరాజు, పావాడ కామరాజు, బుదిరెడ్డి చిన్న, బుదిరెడ్డి మోహన్, గళ్లా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సర్క్యులర్ రద్దు చేయాలి

పరవాడ: ఎన్టీపీసీ యాజమాన్యం అక్రమంగా విడుదల చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయలని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల ఫోన్లను ప్లాంటు లోపలికి అనుమతించబోమని చెప్పడం దుర్మార్గమన్నారు.

అనకాపల్లి సినిమాలు

మిస్టిక్ (ఉదయం, సాయంత్రం)	
బేబి (మ్యాట్నీ, రాత్రి)	:రాజా
ఏం చేస్తున్నావ్	:సత్యనారాయణ స్క్రీన్-1
ద ఈక్వలైజర్ 3	:సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:షిర్డిసాయి
ఖుషి	:పర్తిసాయి
బెదురులంక 2012	:వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:శ్రీసత్య
ఖుషి	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 240 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	4,410
రెండో రకం	3,980	4,050
మూడోరకం	3,800	3,960

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 398 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

జాతి మరువబోదులే రాజశేఖరా..

నిలువెత్తు రాజసం. ఎదనిండా మంచితనం. ఒక కంట సంక్షేమం.. మరో కంట అభివృద్ధి. ఏళ్లు గడచినా.. నిన్నెలా మరిచిపోగలం రాజన్నా. సంక్షేమ అభివృద్ధి బాటలో నీ తనయుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నువ్వే ఆదర్శం. అందుకే మమ్మల్ని వదిలి నువ్వెక్కడికీ పోలేదు. ప్రతి ఇంట్లో, ప్రతి వీధిలో, ప్రతి ఊరిలో.. ఇలా తెలుగువారి ప్రతి గుండెల్లో చివరి శ్వాస నిలిచే వరకూ.. నీవు చిరస్మరణీయుడివే.

- ఊరూ వాడా మహానేతకు ఘన నివాళి
- సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు



కశింకోటలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్



రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ సత్యవతి, బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లిటౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయ సాధనకు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, మరోసారి సీఎంగా గెలిపించుకుని, మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 108 వాహనాలను ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆరోగ్యశ్రీ తదితర పథకాలతో పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, మరింత సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తున్న సీఎం జగన్‌ను 2024 ఎన్నికల్లో గెలిపించుకునే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్సార్ తొలి సంతకం ఉచిత విద్యుత్ ఫైల్‌పై చేసి, రైతు సంక్షేమానికి బాటలు వేశారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం దేశంలో అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం 500 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

◆ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి ఎంపీపీ గొర్లి సూరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవితంలో ప్రధాన ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఈవోఆర్డీ కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

◆ మండలంలోని గోపాలపురం గ్రామంలో వైఎస్సార్ చిత్రపటానికి ఎంపీపీ గొర్లి సూరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొలగాం సర్పంచ్ ఎస్.ఎన్.లక్ష్మీనరసింహ, మండల కో ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

◆ 81వ వార్డు గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద మహానేత విగ్రహానికి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీలు పాల్గొన్నారు.

◆ గవరపాలెం ఉత్తరాంధ్ర చర్చావేదిక కార్యాలయం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి వేదిక ప్రతినిధి బుద్ద రాజేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. వేదిక సభ్యులు పెట్ల నాగేశ్వరరావు, వెంకటరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

◆ వేల్పులవీధి సర్వకామదాంబపార్కు వద్ద సచివాలయ కన్వీనర్ ఉగ్గిన అప్పారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొండా శంకరరావు, వేల్పుల గణేష్, నగిరి రామారావు, బొండా వాసు పాల్గొన్నారు.

◆ 80వ వార్డు పరిధిలో వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని దాడి రత్నాకర్ పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల రాంబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ మహానేత వైఎస్సార్ మరణంతో ఎందరో గుండె చప్పుడు ఆగి మరణించారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక చిన నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వైఎస్సార్ నిలువెత్తు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. రాజన్న రాజ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందన్నారు. సీఎం జగన్ విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ బడుగు, బలహీనవర్గాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. కార్యక్రమంలో సత్యదేవ్ ఆస్పత్రి అధినేత లక్ష్మీనర్సింహారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ శ్రేణులు బొడ్డేడ శివ, కొండూరు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



తుమ్మపాలలో పేదలకు దుప్పట్లు అందిస్తున్న ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్ కుమార్

అనకాపల్లి రూరల్: తుమ్మపాల మేజర్ పంచాయతీలో శనివారం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ నేతలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ గ్రామంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల కొత్తగా మంజూరైన 53 మందికి పింఛన్లను అందించారు. అనంతరం తుమ్మపాల ప్రధాన వీధిలో జరిగిన ఓ కార్యక్రమంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ తన సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీలు పస్సీరు వెంకటలక్ష్మి, వద్దాది భారతి, వద్దాది అశోక్, పంచదార్ల కన్నారావు, ఉప సర్పంచ్ చదరం చిన్నా, పీల విశ్వేశ్వరరావు, పీల బుజ్జి, వార్డు సభ్యులు వెలగా మోదినాయుడు, రామారావు, ముత్యాల వెంకటలక్ష్మి, తరసత్యారావు, రవ్వ భవానీ, నాగరాజు, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట: దివంగత మహానేత వైఎస్సార్ తన పాలనతో రాష్ట్రానికి నిరుపమానమైన సేవలందించారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కీర్తించారు. కశింకోటలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి స్థానిక పంచాయతీ ప్రధాన రహదారిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని కొనియాడారు.



తాళ్లపాలెంలో మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చిన నాలుగురోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద జానకీరామరాజు, జాజుల రమేష్



80వ వార్డులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాడి రత్నాకర్

ప్రధానంగా ఆరోగ్యశ్రీతో లక్షలాది పేదలకు ఆరోగ్య ధీమానిచ్చారని, జలయజ్ఞం వేల గ్రామాలకు సాగు నీరు అందించి, రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి పాటుపడ్డారని తెలిపారు. ఇలా పలు పథకాల అమలుతో ప్రజల గుండెల్లో చిరస్మరణీయునిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ మంత్రి జయరజని, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, అనకాపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, పార్టీ నాయకులు నడిపల్లి నాయుడు, పందూరి ఎరుకునాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

◆ మండలంలోని తాళ్లపాలెంలో దివంగత మహానేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ పూలమాల వేసి నివాళులర్పించారు.



సర్వకామదాంబ పార్కులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జాజుల రమేష్



ఉత్తరాంధ్ర చర్చా వేదిక కార్యాలయం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి ఘన నివాళి



81వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్



గోపాలపురం గ్రామంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు



ఎంపీడీవో కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

నూకాంబిక భక్తుల సేవకు ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శన భాగ్యం, ఇతర సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అన్నారు. దేవస్థానం ఆవరణలో ఆలయ ఈవో బండారు ప్రసాద్ అధ్యక్షతన ఉద్యోగులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, నిత్యాన్నదానం, భక్తుల ప్రసాద వితరణలో ఎటువంటి మార్పులు లేకుండా చూడాలని సూచించారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజుల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, వాతావరణంలో మార్పుల ఆధారంగా భక్తులకు సేవలందించాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు కంటపల్లి శోభారాణి, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, పాము అనురాధ, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమాచంద్ర మహేశ్వరి, బుద్ద నరసింగరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, ఎక్స్ అఫీషియో మెంబర్ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ

అనకాపల్లిటౌన్:అర్హత కలిగిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు 22 మందికి కొత్త పెన్షన్లు అందించినట్లు 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ తెలిపారు. స్థానిక వార్డు పరిధి 12వ సచివాలయంలో శనివారం కొత్తపె పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దశల వారీగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వలంటీర్ వ్యవస్థ ద్వారా సకాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు మాధురి నాయుడు, ఎ.రవికుమార్, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన ఈసీఈ వర్క్‌షాప్



విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ వైకుంఠరావు, విభాగాధిపతి పూర్ణిమ

అనకాపల్లిటౌన్: స్థానిక డైట్ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఈసీఈ వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(ఈసీఈ) వర్క్‌షాప్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌ల ద్వారా వివిధ టెక్నిక్‌లు అలవర్చుకోవడంతోపాటు నూతన టెక్నాలజీలో మెళకువలు తెలుసుకోవచ్చన్నారు. అంతకు ముందు వర్క్‌షాప్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి పి.పూర్ణిమ, రిసోర్స్‌పర్సన్ ఎం.ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు మార్కింగ్ పనులు

అనకాపల్లిటౌన్: స్థానిక జాతీయ రహదారి తోటాడ జంక్షన్ నుంచి నూకాంబిక ఆలయం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఉన్న రహదారి విస్తరణకు మార్కింగ్ పనులు శనివారం ప్రారంభించినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారి జనార్దనరావుతెలిపారు. సుమారు 2.2 కిలోమీటర్ల పొడవు, 60 అడుగుల వెడల్పున రహదారిని విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు రోడ్డు విస్తరణకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నట్లు తెలిపారు. విస్తరణలో గృహాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

కారును ఢీకొన్న లారీ

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద శనివారం సాయంత్రం రెండు లారీల నడుమ చిక్కుకుని కారు ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తూ అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కాకినాడ నుంచి గాజువాక వెళుతున్న కారు బయ్యవరం చేరే సరికి వర్షం పడుతుండటంతో అకస్మాత్తుగా ఆపిన ముందున్న లారీని ఢీకొంది. ఇంతలో వెనుక నుంచి మరో లారీ వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారు రెండు వైపులా దెబ్బతింది. అయితే దానిలో ప్రయాణిస్తున్న ముగ్గురికీ పెద్ద ప్రమాదం కలగలేదు. వారు గాజువాక ప్రాంతానికి చెందిన వారని సమాచారం. అయితే ఈ విషయమై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

దంచి కొట్టిన వాన



నెహ్రూచౌక్ వద్ద కురుస్తున్న భారీ వర్షం

అనకాపల్లిటౌన్: పెనుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో పట్టణం తడిసిముద్దయింది. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోయిన ప్రజలకు వర్షం ఉపశమనాన్నిచ్చింది. ఇప్పటికే రైతులు తమ పొలాల్లో వేసిన వరి నారుకు ఈ వర్షం జీవం పోసిందనే చెప్పాలి. ఈ ఏడాది వరి నారు మడులు సిద్ధం చేసి, నీటి కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షం మేలు చేస్తుంది.

ఘనంగా తోడపెద్దు పాలుకొలుపు ఉత్సవం



ఆకట్టుకుంటున్న సేవగరిడీ

మునగపాక : మండల కేంద్రంలో శనివారం తోడపెద్దు పాలు కొలుపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మునగపాకలోని యర్ర వెంకయ్య తోడపెద్దు పాలు కొలుపు కార్యక్రమంలో జిల్లా పరిధిలో 18 సేవగరిడీలు పాల్గొన్నాయి. సేవ గరిడీలతో పాటు తోడపెద్దులను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తోడపెద్దులను దర్శించుకున్నారు. మునగపాక ఇందిరమ్మ కాలనీ వాసులు బూరెను సమకూర్చారు. సంతబయిన తంపరమూల సంఘం ఆధ్వర్యంలో శీతలపానీయాలను అందజేశారు. సేవగరిడీల కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం తులసీ కళ్యాణమండపం ఆవరణలో అన్న సమారాధన జరిపారు.

ఎంపీని కలిసిన సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్



సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ నాయుడును శాలువాతో సత్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: స్థానిక సుంకర మెట్ట జంక్షన్ సూర్యనారాయణ, సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్‌గా నియమితులైన కె.ఎం.నాయుడును శనివారం ఎంపీ బీవీ సత్యవతిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ నాయుడుకు ఎంపీ సత్యవతి అభినందన సత్కారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. రానున్న కార్తీకమాసంలో దేవాలయానికి భక్తుల తాకిడి పెరుగుతుందని, దీని దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో చెరకు సాగుకు పూర్వ వైభవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జగన్నాథరావు



యంత్రం ద్వారా చెరకు ముచ్చెలు నాటే విధానాన్ని రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

అనకాపల్లిటౌన్: సాగులో ఆధునిక పరిజ్ఞానం ద్వారా చెరకు పంటకు పూర్వ వైభవం తీసుకురావచ్చని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం చెరకు రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెరకు రైతులు అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటారని, పంటసాగు ఖర్చు పెరిగి దిగుబడులు తగ్గి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో యాంత్రీకరణ, సమగ్ర పోషణ యాజమాన్యం, సమగ్ర సస్య రక్షణతో చెరకులో విలువ ఆధారిత ఉత్పత్తులైన బెల్లంపొడి, బెల్లం ముక్కలు, బెల్లం తేనె, బెల్లం చాక్లెట్లు, బెల్లం బిస్కెట్లు, చెరకు రసం తదితర ఉత్పత్తుల తయారీ ద్వారా చెరకు సాగును లాభసాటిగా చేసుకోవచ్చన్నారు. సుగర్‌కేన్ డిప్యూటీ కమిషనర్ లోకేష్ మాట్లాడుతూ చెరకులో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫ్యాక్టరీ పద్ధతిలో దిగుబడి పెంచుకోవాలన్నారు. ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త బి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ వైఎల్‌డీని తట్టుకుని అధిక దిగుబడినిచ్చే చెరకు వంగడాలను ఉపయోగించి రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం.విశాలాక్షి, డి.ఉమామహేశ్వరరావు, శ్రీదేవి, ముకుందరావు, సీతారాం, రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.